
www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 7 మే 2025

5

తిరుపతి



యువతకు ఉపాధి కల్పన కూటమి లక్ష్యం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, సృష్టించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద నూతన పారిశ్రామిక ఔత్సాహిక వేత్తలను ప్రోత్సహించేలా ఏర్పాటుచేసిన ఎంఎస్ఎంఈ ఎంటర్ప్రెనూర్‌కు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. డెవలప్మెంట్ పాలసీ 4.0 కార్యక్రమం 20 ఏళ్ల దీర్ఘ దృష్టితో యువతకు ఉపాధి కల్పించడం వీలవుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

20లక్షల ఉద్యోగాల కల్పనలో మరో మైలురాయి!

- 8న శ్రీసిటీలో ఎల్‌జి యూనిట్‌కు మంత్రి లోకేష్ భూమిపూజ
- రూ.5,001 కోట్ల పెట్టుబడి, 2వేలమందికి ఉద్యోగావకాశాలు
- రూ.839 కోట్లతో మరో 5 అనుబంధ యూనిట్లు



సత్యవేడులో సభాస్థలి సిద్ధం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రాయలసీమలో మరో కీలక ప్రాజెక్టుకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం భూమిపూజ చేయనున్నారు. అంతర్జాతీయ స్థాయి గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ సంస్థ, తిరుపతి సమీపంలోని శ్రీ సిటీలో వచ్చే ఆరేళ్ళలో వివిధ దశల్లో రూ.5,001 కోట్ల వ్యయంతో యూనిట్ ఏర్పాటు చేయబోతోంది. 2024 సెప్టెంబర్‌లో జపాన్ నుండి వచ్చిన ఎల్జీ కంపెనీ ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ పాలసీలు, రాయలసీమను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి చేస్తున్న కృషి, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం తీసుకుంటున్న చర్యల గురించి కంపెనీ ప్రతినిధులకు వివరించారు. మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రంలో యూనిట్ నెలకొల్పేందుకు ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ముందుకు వచ్చింది. ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, ఏసీలతో పాటు ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఈ యూనిట్‌లో తయారవుతాయి. ఎల్‌జి సంస్థ తమ ఉత్పత్తులకు అవసరమైన విడి భాగాలను వేరే దేశాల నుండి తీసుకురావడం కాకుండా ఇక్కడే కంప్రెసర్, మోటార్ కంప్రెసర్, హీట్ ఎక్స్‌చేంజర్ భాగాలను తయారు చేయనుంది. శ్రీసిటీలో ఏర్పాటుచేసే యూనిట్, అనుబంధ కంపెనీల ద్వారా రాబోయే ఆరేళ్లలో యువతకు 2వేల ఉద్యోగాలు లభించనున్నాయి. రూ.839 కోట్లతో మరో 5 అనుబంధ యూనిట్లు ఆరేళ్లలో ఏర్పాటు కాబోతున్నాయి.


మంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - సత్యవేడు: మంత్రి నారాలోకేష్ ఈ రోజు సత్యవేడుకు రానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు వారపు సంత స్థలంలో దాదాపుగా పూర్తయ్యాయి. శాప్ ఛైర్మన్ రవి నాయుడు, నియోజవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, సమన్వయకర్త డాక్టర్ శ్రీపతిబాబు బృందం స్థానిక నేతలతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మరోపక్క స్థానిక సీఐ మురళినాయుడు, ఎస్ఐ రామస్వామి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీవారి మెట్టు మార్గంలో

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

టిటిడి ఈవో జె.శ్యామల రావు



శ్రీవారి మెట్టు మార్గం వద్ద భక్తులతో మాట్లాడుతున్న ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

ప్రజాశక్తి - రామచంద్రాపురం: తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తులకు శ్రీవారి మెట్టు మార్గంలో మెరుగైన సౌకర్యాలు కల్పిసామని టిటిడి ఈవో జె. శ్యామలరావు తెలిపారు. కాలినడకన వెళ్లే మార్గంలో టోకెన్లు పొందేందుకు భక్తులు అసౌకర్యానికి గురౌతున్నట్లు తెలియడంతో టిటిడి అదనపు సిహెచ్ వెంకయ్య చౌదరి, టిటిడి జేఈవో వీరబ్రహ్మంలతో కలిసి ఆయన మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలను ఆటోవాలాలు స్వప్రయోజనాలకు వాడుకుంటున్నట్లు, భక్తుల నుండి విచ్చలవిడిగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు శాశ్వత పరిష్కార మార్గం దిశగా చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. శ్రీవారి మెట్టు మార్గం వరకు బస్సుల సంఖ్య పెంచడం, టోకన్ల జారీ కౌంటర్లను పెంచే అంశాలను పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి సీఈ సత్యనారాయణ, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం, టిటిడి డిప్యూటీ ఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

టిటిడి పాలకమండలి అత్యవసర భేటీ

పలు కీలక నిర్ణయాలు కోసమే సమావేశం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం మండలి అత్యవసరంగా సమావేశం కానుంది. ఈ అత్యవసర సమావేశం చర్చనీయాంశంగా మారింది. అసలు తిరుమలలో ఏం జరుగుతోంది? ఎందుకు అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నారు? ఈ సమావేశంలో ఏ నిర్ణయాలు తీసుకుంటారనేది ఆసక్తి రేపుతోంది. అత్యవసర సమావేశం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ సమావేశం తిరుమల అన్నమయ్య భవన్‌లో బుధవారం ఉదయం జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వం సూచనతోనే బోర్డు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచారం. సమావేశానికి హాజరు కావలసిందిగా టీటీడీ పాలకమండలి సభ్యులకు అత్యవసర సమాచారం అందించారు. తిరుమలకు రావడానికి వీలులేని సభ్యులు ఆన్‌లైన్ జూమ్ విధానంలో సమావేశంలో పాల్గొనాలని టీటీడీ సూచించింది. ఈనెల 8వ తేదీన మంత్రివర్గ సమావేశం కానున్న సందర్భంగా, టీటీడీ బోర్డు ప్రధాన అంశాలపై మంత్రివర్గంలో చర్చించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే అత్యవసర పాలకమండలి సమావేశంలో కొన్ని ముఖ్య అంశాలకు ఆమోదముద్ర వేయనున్నారు. అలిపిరి ప్రాంతంలో ముంతాజ్ హోటల్‌కు కేటాయించిన స్థలాన్ని రద్దుచేసి, ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించడం పాలకమండలిలో ప్రధాన అజెండాగా చేర్చనున్నట్లు సమాచారం. ప్రధాన రహదారికి అటువైపునున్న 20 ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు చర్చ నడుస్తోంది. తిరుమల భక్తుల సౌకర్యార్థం తిరుపతి రైల్వే స్టేషన్ ఆర్టీసీ బస్టాండ్‌ల నుంచి శ్రీవారి మెట్టు మార్గానికి ఉచితంగా టీటీడీ ఎలక్ట్రికల్ బస్సులను నడిపేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సుమారు 20 ఎలక్ట్రికల్ బస్సులను టీటీడీకి తెప్పించేందుకు పాలకమండలిలో ఆమోదం తెలుపనున్నారు. దీంతోపాటు మరో రెండు అంశాలను అజెండాగా సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్‌కు

611 మంది హాజరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో , తిరుపతి టౌన్: జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఈ పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకుగాను 611 (67.07శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 300 మంది గైర్హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, త్రాగునీరు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను చేయడం జరిగిందని తెలిపారు.

రైల్వే అండర్ బ్రిడ్జీల

నిర్మాణ పురోగతిపై ఎంపీ సమీక్ష



అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ గురుమూర్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గత ప్రభుత్వ హయాంలో కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 12.23 కోట్లతో పట్టణంలోని ప్రధాన ప్రాంతాలయిన హీరో హోండా షోరూం వద్ద ఎల్.సి-107, రైల్వే సి.ఆర్.ఎస్ వద్ద ఉన్న ఎల్.సి-109 అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి అంగీకారం తెలుపుతూ అప్పట్లోనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. విధానపరమైన అనుమతులు పూర్తి కావడంతో ఎట్టకేలకు పనులు మొదలయ్యాయి. ఇదిలా ఉండగా తిరుపతి ఎంపీ డా.మద్దిల గురుమూర్తి సోమవారం పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చూడాలని రైల్వే ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైల్వే లైన్ కి ఇరువైపులా పట్టణం విస్తరించి ఉండటంతో రైల్వే గేట్ల సమీపంలో వాహన చోదకుల ట్రాఫిక్ కష్టాలు వర్ణణాతీతమన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఇంజనీరింగ్ విభాగం అదికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

11 నుండి అమ్మవారి వసంతోత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుచానూరు, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మే 11 నుండి 13వ వరకు వార్షిక వసంతోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాల కారణంగా ఈ నెల 11 నుండి 13వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టిటిడి ఆలయ అర్చకులు బాబు స్వామి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ జీ.రమేష్, ఆలయ ఇన్స్పెక్టర్లు చలపతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల గాలివాన



వెంకటగిరిలో.. జలమయం

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్: వెంకటగిరి టౌన్, పరిసర ప్రాంతాలలో మంగళవారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి మార్కెట్ వీధి, ఆర్టీసీ బస్టాండ్, ఎన్టీఆర్ కాలనీ, బంగారు పేట బీసీ కాలనీ తదితర ఏరియాల్లో నీరు నిల్వచేరింది.

నగిరి నియోజకవర్గ వ్యాప్తంగా..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలోని వడమాలపేట, పుత్తూరు, విజయపురం, నగరి, నింద్ర మండల పరిసర ప్రాంతాలలోమంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 38 డిగ్రీలతో ఎండ కాసింది. ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కరయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి మేఘాలు కమ్ముకుని, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో కొంతమేరకు ప్రజలకు ఉపశమనం కలిగింది. గాలులకు కొన్నిచోట్ల విద్యుత్ తీగలపై చెట్లు కొమ్మలు విరిగిపడడం టంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. పంట పొలాల్లో వరిపైరు నేల ఒరగడం, మామిడి పంట నేలరాలడం వంటివి జరగడంతో రైతలకు నష్టం వాటిల్లింది.



పుత్తూరులో జోరు వాన

బహిరంగ సభను జయప్రదం చేయండి

- 8వ తేదీ జరుగనున్న సభ సందర్భంగా స్కూటర్ ర్యాలీ నిర్వహించిన సిపిఎం నేతలు



తిరుపతిలో స్కూటర్ ర్యాలీలో పాల్గొన్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఈనెల 8, 9, 10 తేదీలలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని మంగళవారం ఉదయం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ స్కూటర్ ర్యాలీ పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమై నాలుగు కాళ్ల మండపం అంబేద్కర్ విగ్రహం రైల్వే స్టేషన్ మీదుగా కరణాల వీది, గాంధీ రోడ్, జ్యోతిరావు పూలే విగ్రహం మీదుగా ఎన్టీఆర్ సర్కిల్, టీకే స్ట్రీట్, భవాని నగర్, కెటి రోడ్డు మీదుగా యశోద నగర్ లోని సిపిఎం కార్యాలయం చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సిపిఎం, భవిష్యత్తులో పోరాటాలకు ముందుంటుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడం కోసం ఈ సమావేశంలో చర్చించి పోరాటాలను రూపకల్పన చేయబోతున్నామన్నారు. ప్రపంచ ప్రసిద్ధి పొందిన తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల సౌకర్యాలను మెరుగుదల నుంచి, కాంట్రాక్ట్ కార్మికుల కష్టాల పరిష్కారం వరకు అనేక అంశాల మీద నిరంతరం పోరాడుతూ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, భక్తులు, కార్మికులు, ఉద్యోగుల పక్షాన తిరుపతి, తిరుమల ప్రజల పక్షాన సిపిఎం పోరాడుతుందని తెలిపారు. తిరుపతి నగర అభివృద్ధికి టీటీడీ నిధులు వినియోగించాలని 30 సంవత్సరాలుగా ప్రజల తరపున పోరాడుతున్నామని తెలిపారు. మానవసేవే మాధవసేవ అన్న నానుడి అనుసరించి ఆధ్యాత్మిక వ్యవహారాలతో పాటు టీటీడీ లాంటి సంస్థలు విద్యా వైద్య సామాజిక అంశాలు జోక్యం చేసుకొని తోడ్పడాలని, గత వారసత్వాన్ని కొనసాగించాలని టిటిడికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తిరుపతి కేంద్రంగా మత చిచ్చు రగల్చడానికి ప్రయత్నం చేసిన మతోన్మాద శక్తులను బిజెపి అనుకూల సంస్థలను ఎదుర్కొని, టీటీడీ పరిరక్షణ కొరకు పనిచేసింది, ప్రజలతో శాంతియుత వాతావరణం కాపాడింది టీటీడీ విద్యా వైద్య సంస్థలో మత ప్రాతిపదికన నియామకరణం వ్యతిరేకించింది సిపిఎం అని అన్నారు.

ఈ రాష్ట్ర సమావేశాలకు సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎంఎ బేబీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బి.వి రాఘవులు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావులుతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి నాయకులు సమావేశంలో పాల్గొంటున్నారని ఈ సమావేశాలకు వేదికగా తిరుపతి నగరం ప్రాతినిధ్యం ఇస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి సుబ్రమణ్యం, కే వేణుగోపాల్, ఎస్ జై చంద్ర, సాయి లక్ష్మి, మాధవ, కృష్ణా పి.బుజ్జి, పి.చిన్న, ఎం.నరేంద్ర, ఆర్ మల్లికార్జునరావు, వి.ప్రభాకర్, పి.రమేష్, ఏ.రాధాకృష్ణ, ఎన్‌డి శ్రీనివాసులు, వాసు, సుజాతమ్మ, నారాయణస్వామి, శ్రీరాములు, సాయి, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

చాటింపుతో గంగ జాతర ఆరంభం

- విశ్వరూప స్థూపానికి అభిషేకం
- ఊరేగింపుగా రానున్న అవిలాల పుట్టింటి సారె

తిరుపతి పొలిమేరలో మంగళవారం అర్ధరాత్రి వేసే చాటింపుతో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మొదలు కానుంది. దీనికి ముందు మంగళ వారం ఉదయం 7 గంటలకు గంగమ్మ ఆలయంలోని విశ్వరూప స్థూపానికి పరిమళ, పవిత్ర జలాలతో అభిషేకం చేసి వడిబాల కడతారు. దీంతో జాతర ప్రాధాన్యత సంతరించుకుంటుంది. సాయంత్రం గంగమ్మ జన్మస్థలమైన రూరల్ మండలం, అవిలాల నుంచి సారె వస్తుంది. సారెతో పాటు స్థానిక కైకాల వారు నగర పొలిమేర్లలో చాటింపు వేస్తారు.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:


తిరుపతి గంగమ్మ ఆలయ ప్రాంగణం విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. గంగమ్మ జాతర సందర్భంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, తాగునీరు ఏర్పాటు, పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తుంది. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తుడా ఆధ్వర్యంలో గంగమ్మ ఆలయం వద్ద కొన్ని అభివృద్ధి పనులను చేపట్టడం జరిగింది. ట్రాన్స్కో అధికారులు విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా పనులు చేపట్టారు. దేవదాయ శాఖ అధికారులు కూడా తమ వంతు సహాయ సహకారాలు జాతరకు అందిస్తున్నారు. వీటితోపాటు టిటిడి సహకారంతో కూడా ఆలయం వద్ద కొన్ని పనులు చేపడుతున్నారు. జాతరకు సుమారు లక్ష మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉండడంతో ఇటు పోలీసులు కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వారం రోజులు పాటు జరిగే జాతర కోసం తుడా ఇందిరా మైదానం, మున్సిపల్ ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ వద్ద వద్ద భక్తులు పొంగళ్ళు పెట్టుకోవడానికి చర్యలు తీసుకున్నారు. తుడా గ్రౌండ్ వద్ద వాహనాల పార్కింగ్ కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు.

నేడు బైరాగి వేషం..

వేలాది మంది భక్తులు చిత్ర, విచిత్ర వేషాలు ధరించి అమ్మవారిని దర్శించుకుంటారు. బుధవారం నుంచి వేషాల జాతర మొదలవుతుంది. తరాల తారతమ్యం భక్తి భావనకు అడ్డురాదని నిరూపిస్తూ వేషాలు వేయడానికి జనం పోటీపడతారు. 7వ తేదీ బైరాగి వేషంతో మొదలై బండవేషం, తోటి వేషం, దొరవేషం, మాతంగివేషం వరకు వేషాల జాతర సాగుతుంది. 12వ తేదీ సున్నపుకుండల వేషాలను ఇద్దరు కైకాల కులస్థులు వేస్తారు. వీరు చిన్న గంగమ్మ, పెద్ద గంగమ్మలకు ప్రతీకలుగా భక్తులచేత పూజలందుకుంటారు. 13వ తేదీ మంగళవారం అసలు జాతర సంబరం మొదలవుతుంది. ప్రత్యేక అభిషేకానంతరం వజ్రకిరీటంలో దర్శనమిచ్చే గంగమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతారు. విశేషంగా పొంగళ్లు, జంతుబలులు ఉంటాయి. గంగమ్మ ఆలయం ముందు విశ్వరూప స్థూపానికి బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారు చేస్తారు. 14వ తేదీ వేకువజామున విశ్వరూప ప్రతిమ చెంప తొలిగించడంతో జాతర పరిసమాప్తమవుతుంది.



గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో విశ్వరూపాలయాన్ని సాంప్రదాయ బద్ధంగా వడిభాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి గంగమ్మకు అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ జాతర ప్రతి ఒక్కరు పేద ధనిక తేడా లేకుండా పండుగ చేసుకుంటారని చెప్పారు. తిరుపతి ప్రజలు చల్లగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్టు వెల్లడించారు. వారం రోజులు పాటు ఈ జరిగే గంగమ్మ జాతకం వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మీద ఆర్సి మునికృష్ణ, టిడిపి నాయకులు మబ్బు దేవ నారాయణ రెడ్డి మహేష్ యాదవ్, జనసేన నాయకులు రాజారెడ్డి పాల్గొన్నారు.

గంగ జాతర ఏర్పాట్ల పరిశీలన

నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలసి గంగమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చే మార్గంలో ఇబ్బందులు కలగకుండా మార్కింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అన్ని మార్గాల్లో తగు చర్యలు తీసుకోవాలన్నారు. పొంగళ్ళు పెట్టే ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని అన్నారు. కమిషనర్ వెంట డిఎస్పీ భక్తవత్సలం, సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, ఈ.ఈ.లు తులసి కుమార్, రవీంద్ర, ఆలయ ఈ.ఓ. జయకుమార్, డీసీపీ మహాపాత్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.



రెండో రోజూ కొనసాగిన ధర్నా



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద రెండవ రోజు ధర్నా కార్యక్రమం కొనసాగింది. ధర్నా నుద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండవ రోజు ధర్నా చేపడుతున్నామన్నారు. గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు వెంటనే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వెంకటగిరి మండల ఉపాధ్యక్షులు ఎంవి రమణ, మున్సిపల్ యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ పెంచలయ్య, వెంకటగిరి పట్టణ అధ్యక్షులు సుబ్బయ్య కార్యదర్శి ప్రసాద్, నాయకులు పి.రమణయ్య, శుభ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

ప్రజాశక్తి - రామచంద్రపురం: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రం ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్చార్జ్ అధికారి కృష్ణబాబు పేర్కొన్నారు. మంగళవారం చంద్రగిరి నియోజకవర్గం, తనపల్లి, రామచంద్రాపురం మండలంలోని గంగిరెడ్డిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లను కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌లతో కలిసి తనిఖీ చేశారు. తనపల్లిలో డ్వాక్రా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్, డీఐఓ శాంత కుమారి, డిసిహెచ్ఎస్ ఆనందమూర్తి, మెడికల్ సూపరింటెంట్ ఉదయశ్రీ, కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జావిద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి, కాంట్రాక్ట్ - అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి, గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీ.వోలు జారీ చేయాలి తదితర డిమాండ్ల సాధనకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు 20వ తేదీన జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మె, ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారానికి 21, 22 తేదీలలో సమ్మె నిర్వహించుటకు, మున్సిపల్ కమిషనర్ ఏ.వెంకటేశ్వర్లుకు నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు బి.రమేష్, కార్యదర్శి ధారా.కోటేశ్వరరావు, ఎన్. వెంకటరమణ, బి.మురళి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: భూముల రీ సర్వేతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం తిమ్మ భోపాలపురంలో రెవెన్యూ అధికారులు భూముల రీ సర్వేకు సంబంధించి గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూముల రీసర్వే రైతులకు వరమని, రీసర్వేకు సహకరించాలని కోరారు. గ్రామంలో మొత్తం విస్తీర్ణం 386.78 ఎకరాలు ఉండగా, ఇందులో పట్టా భూములు 263.60 ఎకరములు, ప్రభుత్వ భూములు 123.18 ఎకరములు, ఈ భూమిలో మొత్తం సర్వే నంబర్లు 56 మాత్రమే. మొత్తం సర్వే నంబర్లకుగాను సబ్ డివిజన్ పరిధిలో 909 మాత్రమే. ఇందులో గవర్నమెంట్ ఖాతాలో 9, నేషనల్ ఖాతాలు 76 ఉన్నాయని వివరాలు తెలిపారు. వచ్చే వారం నుండి రీ సర్వే మొదలవుతుందని రెవెన్యూ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్, డిటీ చంద్ర బాబునాయుడు, సర్వేయర్ హరినాథ్, విఆర్ఓ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సుమతికి పితృవియోగం



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మండలం, పుదూరు సర్పంచ్ మల్లాపు సుమతి తండ్రి వైసీపీ నాయకులు ఈగ సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, వైసీపీ నాయకులతో కలసి పుదూరు, కుప్పరగుంటని సుబ్రహ్మణ్యం నివాసానికి చేరుకుని అయన పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం కుమార్తె ఆ గ్రామ సర్పంచ్ మల్లాపు సుమతిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, నాయుడుపేట వైసీపీ మండల అధ్యక్షులు ఒట్టూరూ కిషోర్ యాదవ్, ఎంపీపీ కురగుండ్ల ధనలక్ష్మి, ఆకుతోట సుబ్బారెడ్డి, పిల్లాస మణి, గంగిపంగి శారదమ్మ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ బహుమానం చెల్లించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టిటిడిలో పనిచేస్తున్న ఎఫ్.ఎం.ఎస్,హెల్త్ కాంట్రాక్ట్ కార్మికులకు లడ్డు, వడలు ఇచ్చేందుకు రేపు జరిగే అత్యవసర టిటిడి పాలక మండలి సమావేశంలో తీర్మానం చేయాలని, బ్రహ్మోత్సవ బహుమానం చెల్లించాలని సి.ఐ.టి. యు నేత టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. డిమాడ్లను పట్టించుకోకుంటే 20తేదీన టిటిడి పరిపాలన భవనం వద్ద ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :



కరపత్రాలు పంచుతున్న సిపిఎం నాయకులు


తిరుపతిలో 8,9,10 తేదీలలో జరగనున్న సి.పి.ఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా తిరుపతి జిల్లా గూడూరు డివిజన్ సి.పి.ఎం నాయకులు గూడూరు, సి.పి.ఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఈ నెల 8 వ తేది తిరుపతి లో జరగనున్న బహిరంగ సభకు సభాధ్యక్షులు వంద వాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి సి.పి.ఐ(ఎం), తిరుపతి ముఖ్యఅతిథి ఎం.ఏ.బేబీ, అఖిలభారత కార్యదర్శి సి.పి.ఐ (ఎం), న్యూఢిల్లీ ప్రధాన వక్త బి.వి.రాఘవులు, పోలిట్ బ్యూరో సభ్యులు, సిపిఐ (ఎం), న్యూఢిల్లీ, ఉపన్యాసకులు వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి సి.పి.ఐ(ఎం) అమరావతి, డి. రమాదేవి, కే.లోకనాథం, కేంద్ర కమిటీ సభ్యులు, సిపిఐ(ఎం) అమరావతి, మూలం రమేష్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, కందారపు మురళి కార్యదర్శివర్గ సభ్యులు, తిరుపతి జిల్లా, ఏ.పుల్లయ్య, కార్యదర్శివర్గ సభ్యులు, తిరుపతి జిల్లా, డి.జనార్దన్, కార్యదర్శివర్గ సభ్యులు తిరుపతి జిల్లా, టి.సుబ్రమణ్యం కార్యదర్శివర్గ సభ్యులు తిరుపతి జిల్లా, బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. 8వ తేది, గురువారం సాయంత్రం నాలుగు గంటలకు, తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో సభ ప్రారంభమవుతుందని తెలిపారు. సాయంత్రం 3.30 గంటలకు, ఆర్టీసీ బస్టాండ్ నుండి ప్రదర్శనగా బయలుదేరి ఆడిటోరియంకు చేరతారని తెలిపారు. అభిమానులు, పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు, మేధావులు అందరూ పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి.శివకుమార్, సి.పి.ఎం నాయకులు బి.వి.రమణయ్య, పామంజి మణి, బి.చంద్రయ్య, గుర్రం రమణయ్య, సి.ఐ.టి.యు మహిళా కమిటీ సభ్యులు కే.ధనమ్మ, బి.యశోదమ్మ, ఎస్.నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లుగా అయూబ్ ఖాన్, గురవయ్య




ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఎస్పీడీసీఎల్) డైరెక్టర్లుగా పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్యలను నియమిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఎస్పీడీసీఎల్‌లో చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో ఈ ఏడాది ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందిన పి.అయూబ్ ఖాన్‌ను డైరెక్టర్/ప్రాజెక్ట్స్‌గా నియమించింది. అదే విధంగా ఏపీ ఎస్పీడీసీఎల్ లో చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో గత ఏడాది మే 31న పదవీ విరమణ పొందిన కే.గురవయ్యను డైరెక్టర్/టెక్నికల్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వారు బాధ్యతలను స్వీకరించనున్నారు.

సర్పంచ్ సుభాషిణికి సత్కారం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: చెర్లోపల్లి పంచాయతీ సర్పంచ్ బొల్లినేని సుభాషిణిని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సత్కరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెర్లోపల్లి సర్పంచ్ బొల్లినేని సుభాషిని "సశక్త పంచాయతీ నేత్రీ అభియాన్" జాతీయ పురస్కారం అందుకోవడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరి ఆమోదంతో సంస్థాగత ఎన్నికలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టీడీపీ సంస్థాగత ఎన్నికలు అందరి ఆమోదంతో జరుగుతున్నాయని పార్టీ పరిశీలకులు, పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ డి.ఎస్ గణేష్, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు పట్టణంలో 25, 5, 4, 3 వార్డుల్లో సంస్థాగత ఎన్నికలు నిర్వహించి, వార్డు అధ్యక్ష కార్యదర్శులు, బూత్ కన్వీనర్ కో కన్వీనర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి జ్యోతి నాయుడు, మాజీ ప్రధాన కార్యదర్శి గుణశేఖర్, ఆలయ మాజీ ధర్మకర్త కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాస్ వ్యవస్థాపకులు డాక్టర్ మునిరత్నం వర్ధంతిని పురస్కరించుకొని పుత్తూరులో పేదలకు. శంకర్ నేత్రాలయ చెన్నై వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య విచ్చేశారు. పలువురు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, తేజ, మునిశేఖర్, ప్రకాష్, ఏకాంబరం, మణి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్తుకు పునాది వేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కిశోర బాలబాలికలలో మంచి ఆలోచనలు కలిగే విధంగా ప్రతి విషయంపై అవగాహన కల్పించాలని సిడిపిఓ ప్రమీల తెలిపారు. మంగళవారం పుత్తూరు రూరల్ పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఏఎన్ఎంలకు, సంఘమిత్రలకు, అంగన్వాడీ కార్యకర్తలకు వెలుగు కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు గీతాంజలి, అనిత, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అశోక్ పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, గోపాల కృష్ణాపురం, నేసనూరు పంచాయితీలలో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు టీడీపీ గ్రామ కమిటి ఎన్నికలకు సంబంధించి మంగళవారం సమావేశం నిర్వహించారు. పుత్తూరు రూరల్ మండల ఎన్నికల పరిశీలకులు డి.రవినాయుడు ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గోపాలకృష్ణాపురం అధ్యక్షులుగా టీ.ఎం.గంగా కుమార్‌ను, ప్రధాన కార్యదర్శిగా సి.తేజను, నేసునూరు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పి.రమేష్‌ను, ప్రధాన కార్యదర్శిగా డి.మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ గంజి మాధవయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ ప్రధాన కార్యదర్శి అరవ బాలాజీ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కరుణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై అధికారులతో సమావేశం

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండల అభివృద్ధిపై అధికారులతో ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల సమస్యలను అధికారులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి పంచాయతీలో స్మశాన వాటిక నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. ఎండాకాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజలు తమ భూసమస్యలు పింఛన్లు, హౌసింగ్, సిసి రోడ్లు మొదలైన అభివృద్ధి కార్యక్రమాలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వ్యవసాయ యాంత్రీకరణ వస్తువులు, ట్రాక్టర్ మడకలు, విత్తనాలు సంక్షేమ పథకాలు ఉపయోగించుకోవాలని కోరారు. మండలంలో 400 పైగా గోకులం షెడ్లు మంజూరు చేసినందుకు రైతులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, తహసిల్దార్ పరమేశ్వర స్వామి,అన్ని శాఖల అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ డిస్ట్రిబ్యూటర్‌పై దాడి.. ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతికి చెందిన ఓ మెడికల్ డిస్ట్రిబ్యూటర్‌పై కొంతమంది దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఎట్టికేలకు వారి బారి నుంచి తప్పించుకొని, చికిత్స అనంతరం పోలీసులకి ఫిర్యాదు చేయడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రెడ్డి కాలనీలో హాసిని మెడికల్ డిస్ట్రిబ్యూటర్‌గా వ్యాపారం చేస్తున్న చరణ్ కుమార్, తన వద్ద ఉద్యోగిగా పనిచేస్తున్న మహిళతో పరిచయమై సహజీవనం సాగిస్తున్నారు. వీరిద్దరి మధ్య నగదు లావాదేవీలు చోటు చూసుకున్నాయి. ఆమె మద్యానికి అలవాటు పడడంతో, వీరిద్దరి మధ్య దూరం చోటుచేసుకుంది. తనను దూరం చేస్తున్నాడనే ఉద్దేశంతో ఆమె చరణ్ కుమార్‌తో తరచూ గొడవపడేది. అతనిపై కక్ష పెంచుకున్న మహిళ ఈనెల 1వ తేదీ ఆర్సి రోడ్‌లోని పళని థియేటర్లో సినిమా చూస్తున్న చరణ్ కుమార్‌పై కొంతమందితో కలిసి దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడింది. వారి దాడి నుండి తప్పించుకున్న చరణ్ తన స్నేహితుడు రవితేజ సహాయంతో బయటపడి ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. చికిత్స అనంతరం తేరుకున్న, బాధితుడు ఈస్ట్ పోలీసులకు తనను కొంతమంది హత్య చేసేందుకు ప్రయత్నించారని ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహిళను, ఇనంబర్సన్, రవి, గీత, చంద్రకళ లావణ్య, మరి కొందరు కర్ర , ఇనుప రాడ్లతో దాడి చేసినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. మంగళవారం ఉదయం 11.30 నుండి మధ్యాహనం 1:30 వరకు పాత తిరుచానూరు రోడ్డు తిరుపతి ఆపరేషన్ టౌన్ డివిజన్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఆపరేషన్ టౌన్ డివిజన్ ఏపిఎస్పిడిసియల్ ఈఈ విన్నకోటి చంద్ర శేఖర్ రావ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యుత్ చైర్ పర్సన్ శ్రీనివాస ఆంజనేయ మూర్తి, రిటైర్డ్ జడ్జి, ఆర్థిక సభ్యులు రామ మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్.ఎల్.అంజనీ కుమార్‌లు హాజరై, వినియోగదారుల సమస్యలను ఈఈతో కలిసి అడిగి తెలుసుకున్నారు. వినతులు పరిశీలించి అధికారులు ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని సబ్ డివిజన్ ఏడిలు టౌన్ - 1, టౌన్ -2 , టౌన్-3, రేణిగుంట, తిరుపతి టౌన్ డివిజన్ సెక్షన్ పరిధిలోని సెక్షన్ల ఏఈలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిఓ నెం. 77 ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విద్యాలయం మెయిన్ గేట్ దగ్గర జీవో నెంబర్ 77 రద్దు చేయాలని కోరుతూ ఏబివిపి తిరుపతి శాఖ ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దిష్టిబొమ్మను మంగళవారం దగ్ధం చేశారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎబివిపి జాతీయ కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర మాట్లాడుతూ జీవో నెంబర్ 77 రద్దు చేయకుండా ఈ నెల 7న ఐసెట్ పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. జీవో నెంబర్ 77 పైన ఏ స్పష్టమైన నిర్ణయం ఇవ్వకపోతే రేపు జరిగే ఐసెట్ పరీక్షలు ఏబీవీపీ ఆధ్వర్యంలో అడ్డుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేస్తుంటే అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. ఐసెట్ పరీక్షలకు ముందే జిఓ నెం.77 ను రద్దు చేయకపోతే ఐసెట్ పరీక్షలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, కుసుమ, పవన్, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి-కోట: డ్రైవింగ్ లైసెన్స్ లేని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా వేయడం జరిగింది. మంగళవారం కోట మండలం, విద్యానగర్ సెంటర్ వద్ద, ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహన దారులను గుర్తించి జరిమానా విధించారు. అనంతరం ఆయన పలువురు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల పట్ల కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శ్యాంసన్, జాకీర్ హుస్సేన్, శ్రీహరిలు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించండి

ప్రజాశక్తి -కోట : కోట మండలం, కోట క్రాస్ రోడ్డు వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు జోనల్ బోర్డు చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డిని బిజెపి కోట మండలం మాజీ అధ్యక్షుడు సారంగం రమేష్ బాబు కోరారు. మంగళవారం తిరుపతి జిల్లా, గూడూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సన్నపురెడ్డి సురేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ మేరకు కోట పట్టణానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొని, కోట పట్టణంలోని కోట క్రాస్ రోడ్డు వద్ద బస్సు షెల్టర్ యొక్క అవసరతను తెలియజేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు ప్రధాన కూడలి అయిన క్రాస్ రోడ్డు వద్ద గతంలో బస్సు షెల్టర్ ఉండేదని, ప్రస్తుతం రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారని తెలియజేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎటువంటి నీడ లేక మండుటెండలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్ షెల్టర్ నిర్మాణానికి త్వరలో చర్యలు తీసుకోవాలని కోరారు.

కూలీలకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ నిరుపేద కూలీలందరికీ రోజువారి ఉపాధి అవకా శాలుగా అవసరమైన పనులను గుర్తించి పని కల్పించాలని డిఆర్‌డిఏ పిడి శ్రీని వాస్ ప్రసాద్ సూచించారు. మంగళ వారం ఆయన దొరవారిసత్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో నియో జకవర్గంలోని ఆరు మండలాల ఉపాధి హామీ పథకం ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడి ప్రేమ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి, మండల ఏపీవో ఉషారాణి,ఫీల్డ్ అసిస్టెంట్, ఆరు మండలాల ఏపీవోలు టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దత్తత గ్రామాల షెడ్లు పరిశీలన

ప్రజాశక్తి -వెంకటగిరి టౌన్: తిరుపతి జిల్లా -గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణయ్య వెంకటగిరి మండలంలో దత్తత తీసుకున్న షెడ్లు సోమసానిగుంట, వల్లివేడు షెడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. షెడ్లు పునరోద్ధరణ వెంటనే చేపట్టాలని కిందిస్థాయి అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య, డిఆర్పి రవి, వల్లివేడు ఎంపిటిసి, పంచాయతీ సర్పంచ్, సోమసానిగుంట పంచాయతీ సర్పంచ్ అద్దురి చెంచులక్ష్మీ, కార్యదర్శులు మునిరూప్ కుమార్, వైస్సార్ సిపి నాయకులు యస్.రాజేంద్ర క్లాప్ మిత్రాలు పాలొన్నారు.

త్వరలో నూతన గృహాలకు శ్రీకారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, గాంధీనగర్‌లో హౌసింగ్ డిఈ, ఎస్సీ, ఎస్టీ, మానిటరింగ్ అట్రాసిటీ విజిలెన్స్ సభ్యులు ఏసుపాక పెంచలయ్య, రావూరు సురేంద్రలు శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం పి.ఎం.ఏ.వై పథకం ద్వారా నూతన గృహాలను మంజూరు చేస్తామని తెలిపారు.

స్టీల్ సామగ్రి వితరణ

ప్రజాశక్తి -ఏర్పేడు : గుడిమల్లం శ్రీ పరుశురామేశ్వర స్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు తణుకుకు చెందిన వెంకట కృష్ణ కిషోర్ 50 స్టీల్ గ్లాసులు, 50 స్టీల్ ప్లేట్లు అందజేశారు.

క్రైం న్యూస్

బైక్, ఆర్టీసీ బస్సు ఢీ



ప్రజాశక్తి -కోట : కోట మండలం, కొక్కుపాడు రోడ్డు వద్ద మహాలక్ష్మి ఫీడ్స్ అండ్ కెమికల్స్ అధినేత వెంకట కృష్ణారెడ్డి (బాబు రెడ్డి) బైక్ మీద వెళుతుండగా వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు మలుపు వద్ద ఢీకొనింది. దీంతో కృష్ణారెడ్డి కుడికాలు విరిగి తీవ్ర రక్తస్రావమయింది. స్థానికులు ఆయనను హుటాహుటిన హాస్పిటల్‌కి తరలించారు. ఇదే మలుపులో నెల రోజుల క్రితం ప్రమాదం జరగడం, మరలా ఇప్పుడు ఈ ప్రమాదంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించి సక్రమమైన రీతిలో బస్సులు నడపాలని కోరుతున్నారు.

ఊనుగుంటపాలెం వద్ద జింక మృతి



ప్రజాశక్తి-కోట: కోట మండలం, ఊనుగుంటపాలెం రోడ్డు సమీపంలో మామిడి తోపు ప్రక్కన జింక మృతి చెందింది. మంగళవారం ఊనుగుంటపాలెం సమీప అటవీ ప్రాంతం నుండి ఒక జింక నీటి కోసం రాగా, అక్కడే ఉన్న కుక్కలు దాడి చేయడంతో మృతి చెంది ఉండవచ్చని ఫారెస్ట్ సెక్షన్ అధికారులు గాయం శ్రీనివాసులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం పశు వైద్యశాలకు మృతి చెందిన జింకను తీసుకెళ్లారు.

గోడ కూలి వ్యక్తి మృతి



మృతి చెందిన అంజి

ప్రజాశక్తి- ఏర్పేడు: గోడ కూలిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే ఏర్పేడు మండలం, చిందేపల్లి దళితవాడకు చెందిన శెట్టిపల్లి వెంకటేష్ కుమారుడు ఏ శెట్టిపల్లి అంజి (24) మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఒక్కసారిగా వచ్చిన ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో గోడకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన కోటి అనే వ్యక్తి వయసు (27) గాయాలపాలై అసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతి చెందిన అంజికి ఇంకా వివాహం కాలేదు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్



ప్రజాశక్తి - పిచ్చాటూరు: తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌తోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని టిప్పర్‌ను సీజ్ చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్థానికులు అందించిన సమాచారంతో తమిళనాడుకు తరలుతున్న అక్రమ ఇసుక టిప్పర్ను మంగళవారం ఉదయం అప్పలరాజు కండ్రిక పరిసరాల్లో సీజ్ చేశారు. అదుపులోకి తీసుకున్న డ్రైవర్ గోపి అందించిన సమాచారం మేరకు తమిళనాడుకు చెందిన పొన్నేరి పట్టణవాసి ముత్తు కుమార్ ఈ ఇసుక స్మగ్లింగ్లో సూత్రధారి అని, అతన్ని త్వరలో అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు. ఇందులో స్థానికుల ప్రమేయం ఉందని, ఆ వివరాలు త్వరలో వెల్లడి చేస్తామని తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి



మునిశేఖర్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన తిరుపతి రూరల్ మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్, ఆవిలాల పంచాయతీ, సురబి గార్డెన్స్‌లో మునిశేఖర్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం అదే అపార్ట్మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడపైనుంచి పడి బాలుడు మృతి



మృతి చెందిన సురేంద్ర కుమార్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రమాదవశాత్తు బిల్డింగ్ పై నుండి పడి బాలుడు మృతి చెందిన ఘటన మంగళవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని దాత్రి అపార్ట్మెంట్‌లో మృతుడి చిన్నాన్న ఇంటికి కడప జిల్లా సింహాద్రిపురం గ్రామానికి చెందిన సురేంద్ర కుమార్ (13) వేసవి సెలవులు సందర్భంగా వచ్చాడు. కుటుంబ సభ్యులతో నిద్రిస్తున్న సమయంలో సురేంద్ర కుమార్ హఠాత్తుగా బిల్డింగ్ పైనుంచి క్రింద పడిపోవడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అలిపిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.